సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



పాలన గాడిన పడినట్లేనా?

కేయూ రెగ్యులర్ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి నేటితో ఏడాది పూర్తవుతోంది. ఆయన పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది.

- 10లో▸



ముగిసిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శనివారం ముగిశాయి.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
31.2⁰ /23.4⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచుకురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శనిపూజలకు భక్తుల రద్దీ



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం అనుబంధ దేవాలయంలో నవగ్రహాల వద్ద సామూహికంగా శనిపూజలు నిర్వహించారు. శనివారం ముందుగా గోదావరిలో స్నానాలు చేసి నవగ్రహాల వద్ద భక్తులు అధికంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో భక్తుల సందడి నెలకొంది.

సమాచారం ఇవ్వండి

భూపాలపల్లి అర్బన్: అక్రమ మెడిసిన్ అమ్మకాలు చేపట్టినట్లయితే డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని కాపాడే యుద్ధంలో పౌరులే కీలకమన్నారు. పరిసరాల్లో జరిగే అనార్థాలను గుర్తించాలని సూచించారు. మందుల చీటీలు లేకుండా అబార్షన్ కిట్లు, నిద్ర మాత్రలు అనుమానాస్పద మందులు విక్రయించినట్లయితే 18005996969 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కాటారం: గంజాయి సేవించడంతో పాటు జల్సాల కోసం ఇతరులకు గంజాయి విక్రయిస్తున్న యువకులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం గారెపల్లికి చెందిన జాడి వివేక్, ఆకుల అఖిల్, జాడి గణేశ్, దయకి శ్రీకాంత్, సయ్యద్ అస్లాం, కాటారంకు చెందిన గంట పరిపూర్ణం గంజాయికి అలవాటుపడి స్నేహితులుగా మారా రు. ఇదే క్రమంలో మండలంలోని బయ్యారం గ్రామ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్‌లో చేస్తుండగా ఆరుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తారు. పోలీసులు వెంబడించి పట్టుకొని వారి వద్ద గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన పెద్ది నిఖిల్‌రాజ్ అనే వ్యక్తి దగ్గర జాడి వివేక్ 950 గ్రాముల గంజాయి తీసుకొని రాగా అందులో 50 గ్రాముల వరకు గంజాయి సేవించి మిగితా గంజాయి విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఆరు నిందితుల వద్ద 900 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏడుగురిపై కేసు నమోదు కాగా ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఒకరు పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

ఆలయాలలో గుడి గంటల చోరీ

ములుగు రూరల్: ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లవాడ రామాలయం, మాదవరావుపల్లి హనుమాన్ ఆలయంలో గంటలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాలయంలో కంచుతో తయారు చేసిన నాలుగు గంటలు, హనుమాన్ ఆలయంలో ఒక గంటను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయంపై ఆలయ పూజారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీసీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు





కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బంద్ సక్సెస్

వాటాకోసం నినదించిన బీసీలు

- స్వచ్ఛందంగా పాల్గొన్న విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు
- రోడ్డెక్కని ఆర్టీసీ బస్సులు
- మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలు, సంఘాలు
- జిల్లాకేంద్రంలో జేఏసీ నాయకుల ర్యాలీ

భూపాలపల్లి అర్బన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. బంద్‌కు అన్ని బీసీ కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, ఎస్సీ సామాజిక వర్గాల నాయకులు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్దకు బీసీ జేఏసీ నాయకులు చేరుకొని ఆర్టీసీ బస్సులు బయటకి రాకుండా అడ్డుకున్నారు. వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరువ్యాపారులు కూడా బంద్‌లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జేఏసీ నాయకులు పట్టణంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పైడిపల్లి రమేష్, రమేష్, అజయ్, రామగిరి సదానందం, అశోక్, రాజేందర్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల ర్యాలీ

జిల్లాకేంద్రంలోని హన్మాన్ దేవాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు కాంగ్రెస్ నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కళ్లకు గంతలు కట్టుకొని.. మోకాళ్లపై నిల్చుని నిరసన..

సీపీఐ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సెంటర్‌లో పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. బీసీ జర్నలిస్టు సంఘాల నాయకులు అంబేడ్కర్ సెంటర్‌లో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టి అంబేడ్కర్‌సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ మద్దతు..

బంద్‌కు జిల్లాకేంద్రంలో ఎమార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. నల్ల కండువాలు ధరించి పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

ఏ మండలంలో ఎలా జరిగిందంటే..

- **రేగొండ:** బీసీ బంద్ రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో విజయవంతమైంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు.
- **చిట్యాల:** బీసీ బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, ఎమ్మార్పీఎస్, ధర్మ సమాజ్ పార్టీలు మద్దతు తెలిపి మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించాయి. పలు దుకాణాలను నాయకులు బంద్ చేయించారు. శాంతినగర్ గ్రామ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- **మొగుళ్లపల్లి:** మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీసీ సంఘాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, డీఎస్‌పీ ఆధ్వర్యంలో పార్టీల నాయకులు ఉమ్మడిగా ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.
- **కాటారం:** మండలకేంద్రంలోని ప్రధాన కూడలిలోని దుకాణాలు, వ్యాపార సముదాయలు, పెట్రోల్ బంక్‌లు, బ్యాంక్‌లు, ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పలు పార్టీల నాయకులు మూసివేయించారు. కాంగ్రెస్ నాయకులు ప్రధాన కూడలిలో బైక్ ర్యాలీ నిర్వహించారు.
- **కాళేశ్వరం:** మహదేవపూర్ మండల కేంద్రంలో బీసీ బంద్ విజయవంతమైంది. బంద్‌కు బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.
- **మల్హర్:** విద్య, వ్యాపార, వాణిజ్య కేంద్రాలతో పాటు అన్ని వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంద్‌లో వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- **పలిమెల:** మండలంలో వర్తక, వ్యాపారులు బంద్ పాటించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

- మరిన్ని ఫొటోలు 11లో▸

జిల్లా ప్రధాన న్యాయమూర్తితో భేటీ



కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు

భూపాలపల్లి అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్ బాబుతో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే శనివారం భేటీ అయ్యారు. జిల్లా కోర్టులోని తన కార్యాలయంలో కలిసి జిల్లాలో న్యాయ, పరిపాలన, రక్షణ పరమైన అంశాల గురించి చర్చించి న్యాయమూర్తి సూచనలు తీసుకున్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, సీఐ నరేష్ కుమార్, స్పెషల్ పీపీ నిమ్మల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

పురాతన కట్టడాల పరిరక్షణకు కృషి

రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జునరావు



రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

రేగొండ: జిల్లాలో అద్భుతమైన పురాతన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణకు పురావస్తు శాఖ కృషి చేస్తుందని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జునరావు అన్నారు. శనివారం మండలంలోని పాండవుల గుట్టలు, బుగులోని గుట్టలు, మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయాలను పురావస్తు శాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాండవుల గుట్టల్లోని సహజ రాతి ఆకృతులు, పురాతన చిత్రాలు, ప్రకృతి పచ్చదనం ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ గుట్టలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. మండలకేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తు శాఖ ఉప సంచాలకులు నాగరాజు, సాయి కిరణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

విక్రయదారులు నిబంధనలు పాటించాలి

- ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కూరగాయల సంతలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను పరిశీలించి విక్రయదారులతో మాట్లాడారు. టపాసులు విక్రయించాలనుకునే వారు నిబంధనలు ప్రకారం సరైన లైసెన్స్ పొందాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో జనం రద్దీగా ఉండే ప్రదేశాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన, పెట్రోల్ బంకుల సమీపాల్లో దుకాణాలు ఏర్పాటు చేయవద్దన్నారు. తహసీల్దార్, ఫైర్ సర్వీస్, పోలీస్‌శాఖ సూచించిన ప్రదేశాలల్లో లైసెన్స్ ఉన్న వ్యాపారులు షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- డీఈఓ రాజేందర్

కాళేశ్వరం: విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ ఆదేశించారు. శనివారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి స్పెషల్ క్లాసెస్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట ఎంఈఓ ప్రకాశ్‌బాబు, కాంప్లెక్స్ హెచ్‌ఎం బి.అన్నపూర్ణ, డీసీఈబీ సెక్రటరీ కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేందర్, శ్యామ్, శ్రీధర్, సీఆర్పీ సతీష్ ఉన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రాజేందర్

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

ఏపీ ప్రభుత్వానికి ఇది మంచిదికాదు

- సాక్షి దినపత్రిక, ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని, ఉద్దేశపూర్వకంగా సాక్షి దినపత్రికపై దాడులు, ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు ఖండిస్తున్నారు. నిజాలను నిర్భయంగా రాస్తే అక్కడి పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధి అనే విషయాన్ని మర్చిపోవద్దని సూచిస్తున్నారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి



నెహ్రూసెంటర్: సాక్షి దినపత్రిక, ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. పత్రికా స్వేచ్ఛను హరిస్తే సమాజానికి మేలు జరగదు. జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం వల్ల సుపరిపాలన అనిపించుకోదు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదు.

- ఎం.వివేక్, డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు

దాడులను ఖండిస్తున్నాం..



జనగామ: ప్రభుత్వం చేసే మంచి, చెడులను ప్రజలకు తెలియజేస్తూ, మనకు దారి చూపించే పత్రికలపై ఏపీ సర్కార్ తీరు సరికాదు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండిస్తున్నాం. సమాజంలో పత్రికలే మార్గదర్శకంగా ఉండి మనల్ని నడిపిస్తున్నాయి.

-పెండెల శ్రీనివాస్, గ్రామ పరిపాలన ఆఫీసర్ రాష్ట్ర నాయకుడు, జనగామ

కేసుల నమోదు సరికాదు



ములుగు రూరల్: సాక్షి కార్యాలయాలపై ఏపీ ప్రభుత్వం దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. సమాజంలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు తెలియజేసే పత్రికలపై దాడులు, ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సరికాదు. ఏపీ ప్రభుత్వం సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి.

- పోలురాజు, టీఎన్జీఓ ములుగు జిల్లా అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు..



హన్మకొండ అర్బన్: ఏపీలో సాక్షి మీడియాపై అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టువంటిది. సాక్షి మీడియాను, సంస్థ ప్రతినిధులను, జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురిచేయడం దుర్మార్గపు చర్య. పత్రికా స్వేచ్ఛను కాలరాయడమంటే ప్రజల పక్షాన మాట్లాడే గొంతుకను నొక్కడమే.

- ఆకుల రాజేందర్, ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్, హనుమకొండ

కేసులు ఉపసంహరించుకోవాలి



భూపాలపల్లి అర్బన్: ఏపీలో నకిలీ మద్యం కుంభకోణాన్ని వెలుగులోకి తేవడంతోనే సాక్షి పత్రికను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. విచారణల పేరుతో ఎడిటర్, రిపోర్టర్లను ఒత్తిడికి గురి చేయడం పత్రికా స్వేచ్ఛకు భంగం కల్గించడమే. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి.

- కామెర గట్టయ్య, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మద్యం షాపులకు 1,500 దరఖాస్తులు

- భూపాలపల్లి, ములుగు జిల్లాలకు పోటెత్తిన అప్లికేషన్లు
- శనివారం ఒక్కరోజే 879..
- అర్ధరాత్రి వరకు కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ
- గతేడాది 2,161 రాక..
- ఈ ఏడాది తగ్గినా.. పెరిగిన ఆదాయం



ఏటూరునాగారం సర్కిల్ పరిధిలోని షాపులకు అర్ధరాత్రి టెండర్లు వేస్తున్న వ్యాపారులు

భూపాలపల్లి: మద్యం షాపులకు టెండర్లు హోరెత్తాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం రోజు నుంచి అప్లికేషన్లు అంతంత మాత్రంగానే రాగా.. చివరి రోజు శనివారం మాత్రం భారీగా వచ్చాయి. తొలుత వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి టెండర్లు వేయడం లేదని భావించినప్పటికీ, దరఖాస్తు రుసుం పెంచినందునే వెనుకంజ వేసినట్లు తెలిసింది. చివరకు పాత వ్యాపారులంతా రంగంలోకి దిగారు.

ఒకేరోజు 879 అప్లికేషన్లు..

జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని భూపాలపల్లి, కాటారం, ములుగు, ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో 59 మద్యం షాపులకు ప్రభుత్వం గత నెల 26వ తేదీ నుంచి టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 17వ తేదీ వరకు కేవలం 621 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. చివరి రోజు శనివారం రాత్రి 10.30 గంటల వరకు 879 వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో టెండర్లు వేసే వారు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. దీంతో రెండు జిల్లాల్లో మొత్తం సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సర్కారు ఆదాయం పెరిగింది..

రాష్ట్ర ప్రభుత్వం 2023లో రూ.2 లక్షల అప్లికేషన్ ఫీజులో మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించగా రెండు జిల్లాల నుంచి మొత్తం 2,161 అప్లికేషన్లు వచ్చాయి. వాటి ద్వారా రూ.43.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది దరఖాస్తు రుసుమును రూ.3 లక్షలకు పెంచగా శనివారం రాత్రి 11 గంటల వరకు వచ్చిన అప్లికేషన్ల లెక్కల ప్రకారం ప్రభుత్వానికి సుమారు రూ.45 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. అప్లికేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ సర్కారుకు ఆదాయం పెరిగింది.

రెండు షాపులకు నిల్..

ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో ఎస్టీ కేటగిరికి రిజర్వ్ చేసిన గెజిట్ 49, 50 నంబరు గల మద్యం షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. 52, 53, 54, 55 షాపులకు ఒకటి చొప్పున రాగా 58వ షాపుకు రెండు చొప్పున అప్లికేషన్లు వచ్చాయి. కాగా ఆయా షాపులకు సైతం శనివారం రాత్రి వరకు దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

రామప్పలో విదేశీయుల సందడి



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శనివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో శిక్షణ పొందుతున్న టాంజనియా దేశానికి చెందిన 30 మంది అధికారులు సందర్శించారు. ప్రొఫెసర్, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ రావులపాటి మాధవి ఆధ్వర్యంలో వారు రామప్ప ఆలయానికి చేరుకొని రామలింగేశ్వ స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని వారు కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి సరస్సులో బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారులు రవి, సాయికృష్ణ, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన జీఎం



క్రీడాకారులను సత్కరిస్తున్న జీఎం, అధికారులు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు డబ్ల్యూసీఎల్ కంపెనీ నాగపూర్‌లో జరిగిన కోలిండియా ఇంటర్ కంపెనీ లెవల్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన సింగరేణి క్రీడాకారులను శనివారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాసరెడ్డి, మీర్జా యాసిన్, బానోత్ రమేష్, అనుషను శాలువతో సత్కరించి అభినందించి మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించడంలోనే కాకుండా క్రీడలలోనూ అత్యుత్తమ ప్రతిభ చాటడం గర్వించదగిన విషయమన్నారు. సంస్థ తరపున క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాల సాయం అందజేస్తున్నామని తెలిపారు. యువ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం కవీంద్ర, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, అధికారులు, కార్మికులు గుండు రాజు, రాహుల్, శ్రీనివాస్, దేవయ్య, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పాక దేవయ్య పాల్గొన్నారు.

శిల్ప కళాసంపద మహాద్భుతం

● టాంజానియా దేశ సివిల్ సర్వెంట్లు




కాకతీయ కళాతోరణం ఎదుట టాంజానియా సివిల్ సర్వెంట్ల బృందం

ఖిలా వరంగల్: చారిత్రక వైభవాన్ని చాటే కాకతీయుల రాజధాని నిర్మాణం, నల్లరాతితో తయారైన నాటి శిల్ప కళా సంపద మహాద్భుతంగా ఉందని టాంజానియా దేశ మిడ్ లెవెల్ సివిల్ సర్వెంట్ అధికారులు కొనియాడారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీ (డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ)లో ప్రొఫెసర్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ రావులపాటి మాధవి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న టాంజానియా దేశానికి అధికారులు శనివారం సాయంత్రం ఖిలా వరంగల్ కోటను సందర్శించారు. కాకతీయులు కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుత శిల్ప సంపదతోపాటు ఖుష్‌మహాల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిలగుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను పర్యాటక శాఖ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, కోట గైడ్ రవియాదవ్ వివరించారు. ఆనాటి కట్టడాలు, శిల్పకళా సంపద అద్భుతంగా ఉందని కొనియాడారు. అనంతరం వారు టీజీ టీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే సౌండ్ అండ్ లైటింగ్ షోను తిలకించారు. వారి వెంట ఎంసీహెచ్‌ఆర్డీ విజిట్ కో–ఆర్డినేటర్ నందకిషోర్, కేంద్ర పురావస్తుశాఖ కోట ఇన్‌చార్జ్ శ్రీకాంత్, టూరిజం అభివృద్ధి సంస్థ మేనేజర్ అజయ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

పాలన గాడిన పడినట్లేనా?

● కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి పాలనకు నేటితో ఏడాది పూర్తి
● వినియోగంలోనికి రాని కె హబ్, డైనింగ్ హాల్
● కమిటీలు వేసి చర్యలు తీసుకోవడంలో జాప్యం
● కొన్నేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..
● వేధిస్తున్న రెగ్యులర్ అధ్యాపకుల కొరత





కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కొన్నేళ్లుగా పలు సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. రెగ్యులర్ వీసీగా ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పుడు వర్సిటీలోని వివిధ సమస్యలు పరిష్కారమవుతాయని అంతా భావించారు. కానీ, ఆయన ఏనిర్ణయం తీసుకోవడంలోనైనా, దృష్టికి వచ్చిన సమస్యకు పరిష్కారం చూపడంలోనైనా స్లో పాలన కొనసాగిస్తున్నారు. వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించి ఈనెల 19 (ఆదివారం)తో ఏడాది పూర్తవుతోంది. పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది. ఈఏడాదిలో వీసీగా కేయూలో చేపట్టిన కార్యక్రమాలు, పరిష్కారానికి నోచుకున్న సమస్యలు, చేపట్టబోయే అభివృద్ధిపై ప్రత్యేక కథనం.

పాఠాల బోధనేది?

కేయూలో కొన్నేళ్లుగా వివిధ విభాగాల్లో, వివిధ వర్సిటీ కాలేజీల్లోనూ సరిగ్గా తరగతులు జరగడం లేదు. ఉన్న రెగ్యులర్ అధ్యాపకుల్లో కొందరు పరిపాలనా పదవుల్లో కొనసాగుతున్నారు. పాఠాల బోధనపై ఆసక్తి కనబర్చడంలేదు. కొందరు రెండు, మూడు, నాలుగు పదవుల్లోనూ కొనసాగుతుండడం బోధనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకుల్లోనూ కొందరు తరగతులు సరిగ్గా తీసుకోవడం లేదని, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. కాగా, ఇటీవల వీసీ ప్రతాప్‌రెడ్డి బాటనీ విభాగాన్ని తనిఖీ చేయగా టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఎవరూ లేరని గుర్తించారు. ఫార్మసీ కాలేజీకి వెళ్లగా, అక్కడ ప్రిన్సిపాల్, మరో ప్రొఫెసర్ ఉన్నారు. మిగతా పలువురు అధ్యాపకులు ఆసమయంలో విధుల్లో లేరని గుర్తించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్లు సమాచారం. వివిధ విభాగాల్లో ప్రాక్టికల్స్ కూడా మొక్కుబడిగానే చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కేయూలో వినియోగంలోకి తీసుకురావాల్సిన కె హబ్ భవనం

ఏడాదిలో ఏం చేశారంటే..

- ఈఏడాది జూలై 7న కేయూ 23వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించారు.
- పలు సంస్థలతో ఎంఓయూలు చేపట్టారు.
- ఆరోపణలు వచ్చిన వారిపై కమిటీలు వేశారు. పలువురిపై చర్యలు తీసుకున్నారు. మరో రెండు మూడు నివేదికలపై ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.
- గతంలోకంటే కేయూకు బ్లాక్‌గ్రాంటును ఈఆర్థిక సంవత్సరంలో కేయూకు బడ్జెట్‌ను రూ.145 కోట్ల వరకు పెంచడానికి వీసీ కృషి చేశారు. గత మూడునెలలుగా పెన్షనర్లకు ప్రభుత్వం పెన్షన్‌ను మంజూరు చేయడం లేదు. వర్సిటీ అంతర్గత నిధుల నుంచి చెల్లిస్తున్నారు.
- రూసా ప్రాజెక్టుల, సైన్స్ రీసెర్చ్‌ప్రాజెక్టుల పరిశోధనలకోసం సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ భవనం, మహిళా హాస్టల్ భవనం, పద్మాక్షి మహిళా హాస్టల్‌లో నూతనంగా డైనింగ్ హాల్ నిర్మించబోతున్నారు.
- కేయూలోని మహిళా హాస్టళ్లన్నింటికీ కలిసి రూ.3.50 కోట్ల వ్యయంతో ప్రహరీ నిర్మించబోతున్నారు.
- కేయూ చుట్టూ ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు రూ.20 కోట్ల యూనివర్సిటీ నిధులతో 10.2 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మించబోతున్నారు.
- కేయూ పీజీ హాస్టల్ డైనింగ్ హాల్ వద్ద మరో రూ.40 లక్షలు వెచ్చించి కిచెన్ షెడ్డును నిర్మించారు. దీన్ని త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

సమస్యలు అలాగే..

- వర్సిటీలో అడ్మిషన్లు పొందిన వారిలో కొందరికి వసతి కల్పించలేకపోతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఫస్ట్ ఇయర్‌లో ఎవరికీ హాస్టల్ వసతి కల్పించడం లేదు. మరో రెండు హాస్టళ్ల భవనాలు అవసరం ఉంది.
- న్యూపీజీ హాస్టల్ వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మించి మూడేళ్లవుతోంది. నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు.
- వర్సిటీ కాలేజీల్లో అధ్యాపకుల కొరత ఉంది. పార్ట్‌టైం లెక్చరర్లను నియమించాలనే డిమాండ్ ఉంది. ఇటీవల పాలకమండలి కూడా పార్ట్‌టైం లెక్చరర్ల నియామకానికి ఓకే చెప్పింది.
- రూ.4.50 కోట్లతో నిర్మించిన కె హబ్‌ను ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు.
- పీవీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయలేదు.
- రూసా ప్రాజెక్టు కింద రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. వివిధ విభాగాల ప్రొఫెసర్లు ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు చేపట్టలేదు.
- సూపరింటెండెంట్లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది.
- నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు 150 వరకు భర్తీ చేయాల్సి ఉంది.
- 1992 నుంచి రెగ్యులర్ బోధనేతర ఉద్యోగుల నియామకాలు లేవు.
- పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా నియమించాలనే డిమాండ్ అలాగే ఉండిపోయింది.
- రెగ్యులర్ అధ్యాపకులు 77 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 15 ఏళ్లగా నియామకాలు లేవు.
- కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలో అడ్మిషన్ల సంఖ్య పడిపోతోంది. ప్రవేశాలు పొందిన వారికి సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించడం లేదు. పరీక్షలు సకాలంలో నిర్వహించడం లేదు.
- కేయూ భూముల ఆక్రమణలు గుర్తించి స్వాధీనం చేసుకోవడం లేదు.

ఏటీఎంలో నగదు కొల్లగొట్టేందుకు యత్నం

● మిషన్ తెరుచుకోకపోవడంతో దొంగలు పరార్



ధ్వంసమైన ఏటీఎం మిషన్

కాజీపేట: కాజీపేటలోని డీజిల్ కాలనీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించి మిషన్‌ను ధ్వంసం చేశారు. ఏటీఎం మిషన్‌లో డబ్బులు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించిన దుండగులు ముఖాలకు ముసుగులు ధరించి.. వెంట తెచ్చుకున్న ఆయుధాలతో మిషన్‌ను ధ్వంసం చేశారు. ఎంత ప్రయత్నించినా డబ్బులు బయటకు వచ్చే బాక్స్ మాత్రమే ఓపెన్ అయ్యింది. దీంతో దుండగులు కోపంతో మిషన్‌ను ఇష్టం వచ్చినట్లుగా ధ్వంసం చేసి నిరాశతో పరారయ్యారు. ఉదయం వేళ డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వారు గమనించి 100 డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి ఎస్‌బీఐ అధికారులతో పాటు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, శివ క్రైం పార్టీ సిబ్బందితో చేరుకుని ఆధారాల కోసం ప్రయత్నించారు. రహదారులపై ఉన్న సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. ఇది స్థానిక దొంగల పనేనా? లేక ఇతర ప్రాంతాలకు చెందినవారెవరైనా చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఏటీఎంలో దాదాపు రూ.7లక్షల వరకు నిల్వ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బైక్ అదుపు తప్పి వైద్యుడి మృతి



రవికిషోర్ మృతదేహం

తరిగొప్పుల: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా ఒప్పిచెర్ల గ్రామానికి చెందిన మాచర్ల రవికిషోర్ (31) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికిషోర్ గురువారం తన స్వగ్రామం ఒప్పిచెర్లకు వెళ్లి కారంపూడిలో కొత్త బైక్ కొన్నాడు. శుక్రవారం అదే బైక్‌పై తిరిగి మంచిర్యాలకు వస్తున్న క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి క్రాస్‌రోడ్ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో అతడి తల, ఛాతీ భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య హిమబిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాసర్ల రాజయ్య తెలిపారు.



కోర్టులు.. న్యాయం పంచే పవిత్ర స్థలాలు

● హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి
● నూతన కోర్టు భవన సముదాయానికి భూమిపూజ

జనగామ: కోర్టులు న్యాయం పంచే పవిత్ర స్థలాలు అని, న్యాయం జరిగిందన్న నమ్మకంతో కక్షిదారులు కోర్టు నుంచి తిరిగి వెళ్లేలా చూడడం ప్రతీ న్యాయవాది బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం చంపక్ హిల్స్ వద్ద రూ.81 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి హైకోర్టు జడ్జిలు నామవరపు రాజేశ్వరరావు, బీఆర్ మధుసూదన్‌రావు, సుద్దాల చలపతిరావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా న్యాయమూర్తి బి.ప్రతిమ, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్, తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. బాణాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, సిద్ధాంతి క్రిమాచాచారి మంత్రోచ్చరణల నడుమ కోర్టు నూతన భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం హైకోర్టు జడ్జిలు మొక్కలు నాటి నీరు పోశారు.



నూతన కోర్టు భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

న్యాయవాదులు మెరుగైన పాత్ర పోషించాలి..

సిద్దిపేట రోడ్డులోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసుల పరిష్కారం విషయంలో న్యాయవాదులు ప్రావీణ్యతతో మరింత మెరుగైన పాత్ర పోషించాలన్నారు. కక్షిదారులకు సమగ్ర, ధర్మబద్ధ న్యాయం అందించడం న్యాయవాదుల ప్రధాన లక్ష్యమన్నారు. వరకట్న వేధింపులు, చెక్ బౌన్స్ కేసులు కుటుంబ తగాదాలు, భాగస్వామ్య కేసులు ఎక్కువగా వస్తున్నాయని, వీటిని త్వరతగతిన పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో న్యాయవాదులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్టు భవనం రెండేళ్లలో పూర్తవుతుందని కాంట్రాక్టర్ చెప్పారని, కానీ, 20 నెలల్లో ప్రారంభోత్సవం చేసుకుంటామనే నమ్మకం ఉందన్నారు. అనంతరం హైకోర్టు ఆధ్వర్యంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ప్రతిమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్, సీనియర్ సివిల్ జడ్జిలు సి.విక్రమ్, సుచరిత, ప్రిన్సిపల్ జూనిర్ సివిల్ జడ్జి శశి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సందీప, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరాం నర్సయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య



నారాయణ (ఫైల్)

పెద్దవంగర: భూ వివాదం, అప్పుల ఒత్తిడి తట్టుకోలేక మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన రైతు కూన నారాయణ (65) ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణ తనకున్న వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం తన భూమిలో కొంత భాగాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించాడు. రిజిస్ట్రేషన్ పూర్తి కాకపోవడంతో భూమి వివాదం కొనసాగుతోంది. భూ సమస్యలతో పాటు కుటుంబ అవసరాలకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడంతో మానసికంగా ఆవేదనకు గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు శుక్రవారం మృతి చెందాడు. భార్య శశిరేఖ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎండీ హిదాయత్ అలీ తెలిపారు.



ముగిసిన నేషనల్ అథ్లెటిక్స్ మీట్

● హెప్టాథ్లాన్‌లో తెలంగాణకు గోల్డ్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు కొనసాగిన జాతీయస్థాయి 5వ అథ్లెటిక్స్ అండర్–23 చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పలు ఈవెంట్లలో పతకాల కోసం అథ్లెట్లు పోటీపడ్డారు. పోటీల ఏర్పాట్లను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి, అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు వాసుదేవరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. చివరి రోజు జరిగిన పోటీల్లో మహిళల 800 మీటర్ల హెప్టాత్లాన్ విభాగంలో తెలంగాణ నుంచి కేతావత్ సింధు బంగారు పతకాన్ని సాధించింది.



స్టిపుల్ చేజ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

రికార్డులు బ్రేక్

మూడు రోజుల పాటు జరిగిన ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పలువురు అథ్లెట్లు వివిధ విభాగాల్లో పాత రికార్డులు బ్రేక్ చేసి కొత్త రికార్డులు సృష్టించారు. 100 మీటర్ల మహిళల విభాగంలో సుదీష్న హనమంత శివాంకర్ (మహారాష్ట్ర), 100 మీటర్ల మహిళల పరుగు విభాగంలో సాక్షి (గుజరాత్), డిస్కస్‌త్రో మహిళల కేటగిరీలో నిఖితకుమారి (రాజస్తాన్), పురుషుల 20వేల మీటర్ల రేస్‌వాక్‌లో సచిన్‌బొహారా(ఉత్తరాఖండ్), పురుషుల లాంగ్ జంప్‌లో అనురాగ్ సీవీ (కేరళ), 400ల మీటర్ల పురుషుల హార్డిల్స్‌లో అర్జున్ ప్రదీప్ (కేరళ) కొత్త రికార్డులు సృష్టించారు. లాంగ్ జంప్ అనురాగ్ సీవీ తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్నాడు. 2024లో తన పేరు మీద ఉన్న 7.87 మీటర్ల పాత రికార్డు 8.08 మీటర్లతో కొత్త రికార్డును సృష్టించాడు. కాగా 400ల మీటర్ల పురుషుల హార్డిల్స్ విభాగంలో కేరళకు చెందిన అర్జున్ ప్రదీప్ రికార్డు బ్రేక్ చేశాడు. 2022లో యాషెస్ (కర్ణాటక) 50.89 పేరున ఉన్న పాత రికార్డును అర్జున్‌ప్రదీప్ 50.29 స్కోర్‌తో రికార్డు సృష్టించాడు.



హార్డిల్స్‌లో క్రీడాకారిణులు..

కూతురు పెళ్లి చూడకుండానే కానరాని లోకాలకు

● కరెంట్ షాక్‌తో తండ్రి మృతి
● మిన్నంటిన కుటుంబీకుల రోదనలు



రాజయ్య (ఫైల్)

వెంకటాపురం(ఎం): ఒక్కగానొక్క బిడ్డ పెండ్లి ఘనంగా చేద్దామనుకున్నాడు. ఎన్నెన్నో కలలు కన్నాడు. అందుకు తగిన ఏర్పాట్లలో లీనమయ్యాడు. 'నవంబర్ 14న బిడ్డ పెళ్లి పెట్టుకున్న. తప్పక రావాలె. కార్డులు కొట్టిస్తాన. ఇంటికచ్చి పిలుస్త' అని నవ్వుతూ కలిసిన వారందరికీ చెప్పుకున్నాడు. ఇంతలోనే కరెంటు తీగ ఆ తండ్రిని కాటేసింది. విద్యుత్ షాక్ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. పెళ్లి జరగాల్సిన ఇంట విషాదం అలుముకుంది. వెంకటాపురం(ఎం) మండల కేంద్రానికి చెందిన రైతు కూరెళ్ల రాజయ్య(55) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతడికి ఇద్దరు సంతానం. కుమారుడు నరేశ్, కూతురు స్వాతి. బిడ్డ పెళ్లి చేసేందుకు నవంబర్ 7న నిశ్చితార్థం పెట్టుకున్నాడు. నవంబర్ 24న పెళ్లి తేదీని నిర్ణయించారు. ఏర్పాట్లలో భాగంగా మూడు రోజులుగా ఇంట్లో మరమ్మతులు చేయిస్తున్నాడు. అందులో భాగంగా.. శనివారం ఇంట్లోని వైర్లను సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మరికొద్ది రోజుల్లో వైభవంగా పెళ్లి వేడుకలు జరగాల్సిన ఇంట్లో తండ్రి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నిండింది. కుటుంబ సభ్యులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

యాసంగికి సన్నద్ధం కావాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
● ట్రాన్స్ కో, డిస్కం అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: యాసంగి సాగుకు సన్నద్ధం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. హనుమకొండ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌కో సీఈలు, ఎస్ఈలు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈలు, ఎస్ఏఓలతో శనివారం సమీక్ష నిర్వహించారు. డివిజన్లు, జిల్లాల వారీగా ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కొత్తగా నెలకొల్పే 220/33 కేవీ, 132/33 కేవీ కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, డబుల్ సర్క్యూట్ లైన్లు, బే ఎక్స్‌టెన్షన్ ప్రతిపాదనలు పంపాలని, పురోగతిలో ఉన్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులకు ట్రాన్స్‌కోకు లేఖలు రాయాలని సూచించారు. ట్రాన్స్ కో, ఎన్పీడీసీఎల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు తగ్గించాలని, రిపేర్లు పెంచాలన్నారు. వ్యవసాయ, కొత్త సర్వీసులు, టీజీఐ పాస్‌లో నమోదు చేసుకున్న సర్వీసులు త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, కె.తిరుమల్‌రావు, అశోక్, రాజు చౌహాన్, ట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్ శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

వేగంగా సాంకేతికత అభివృద్ధి

● ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి



గ్రాడ్యుయేషన్ డేలో ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి: నేటి ఆధునిక యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ జీవితంలో కొత్త ప్రారంభమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు యూన్సీరాణి, ఎస్.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.